www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 02 | ఫిబ్రవరి | 2025
పేజీలు 8

## ఇది హరిత కలెక్టరేట్




సెంటర్ స్ప్రెడ్

-ఎటు చూసినా పచ్చదనమే
-గార్డెనింగ్‌తో ప్రత్యేక శోభ
-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేక దృష్టి

# ప్రైవేటీకరణకే మొగ్గు

-మద్దతు ధర ఊసెత్తని ఆర్థిక మంత్రి
-అప్పులతో రుణ భారత్‌గా మారే ప్రమాదం
-సంక్షేమం, ఉపాధి ప్రస్తావన కరువు
-అంకెలగారడీ అంటున్న విపక్షం


**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ మరోసారి ప్రైవేటీకరణ వైపే మొగ్గు చూపింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతి ఇవ్వడమే కాకుండా బీమా రంగంలో నూటికి నూరు శాతం పెట్టుబడులకు అవకాశం ఇవ్వడం ద్వారా ప్రైవేటు బీమా సంస్థలకు ప్రభుత్వం దన్నుగా నిలిచినట్లయింది. బడ్జెట్‌పై విపక్షాలు పెదవి విరిశాయి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా బడ్జెట్ లేదని తీవ్ర ఆరోపణలు చేశాయి. విపక్షాల ఆరోపణలకు దన్నుగా నిలిచే రీతిలోనే బడ్జెట్ ఉందన్నది వాస్తవం, దశాబ్ద కాలంలో దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోయాయి. సంపన్నులు మరింత సంపన్నులు అవుతుంటే పేదలు మరింత పేదలవుతున్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కనీస ఆలోచన

మిగతా 2లో..




## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఎనిమిది మంది మావోయిస్టులు మృతి



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మరోసారి తుపాకుల మోత మోగింది. భద్రతాబలగాలుమావోయిస్టులకు నడుమ శనివారం చోటు చేసుకున్న ఎదురు కాల్పుల్లో ఎనిమిది మంది మావోయిస్టులు మృతి చెందారు. ఆ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని

మిగతా 2లో..

- పెద్దఎత్తున ఆయుధాలు స్వాధీనం
- కొనసాగుతున్న ఎదురుకాల్పులు
- హిడ్మా, బడే చొక్కారావు టార్గెట్‌గా కూంబింగ్ ముమ్మరం

## ఘనంగా ప్రారంభమైన రామదాసు జయంతోత్సవాలు




**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచం శ్రీ సీతారామ చంద్ర స్వామివారి ఆలయ ఆవరణలో కంచర్ల గోపన్న, భక్తరామదాసు 392వ జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వాగ్గేయ కారోత్సవాలు ఈనెల 5వ తేది వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ

- అలరించిన నవరత్న సంకీర్తనలు

సందర్భంగా ముందుగా పావనగోదావరి నదీ తీరంలో శ్రీచక్ర సిమెంట్ అధినేద కృష్ణమోహన్, రామదాసు పదోతరం

మిగతా 2లో..

# ప్రైవేటీకరణకే మొగ్గు

(మొదటిపేజీ తరువాయి)

చేయకపోవడం గమనార్హం. బడ్జెట్‌లో ఆర్థిక పరమైన వ్యవహారాలకు సంబంధించి నెలకు లక్ష వేతనం పొందుతున్న వారికి పన్ను మినహాయింపు ఇచ్చి వేతనజీవులను కాస్త తృప్తిపరిచే ప్రయత్నం చేశారు తప్ప ఇప్పటికీ భారతదేశంలో 50 శాతం పైబడి ఆధారపడిన వ్యవసాయ రంగానికి సంబంధించి ఎటువంటి ప్రోత్సాహకాలను ప్రకటించ లేదు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరను ప్రకటించాలని రెండు మూడేళ్లుగా జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలోనైనా బడ్జెట్‌లో ఆలోచన చేస్తారని రైతులు ఆశించారు కానీ అటువంటి ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి లేకపోవడంతో బడ్జెట్‌లో మద్దతు ధరల ఊసెత్తలేదు. గతంలో వ్యవసాయ రంగానికి ఉన్న సబ్సిడీలు, వ్యవసాయ యాంత్రీకరణ తదితర ప్రోత్సాహకాల్లో కూడా కనీస పెరుగుదల లేదు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయింది. దేశ జనాభాలో 50 శాతం ఉన్న యువశక్తి ఉపాధి లేక నిర్వీర్యమవుతుంది. నిరుద్యోగ పెరుగుదల దేశానికి ప్రమాదమని తెలిసినా ఉపాధి రంగాల గురించి ప్రస్తావన లేదు. సంపన్న వర్గాలు ఉంటే చాలు ఉపాధి రంగాల ఊసెందుకన్నట్లు నిర్మలా సీతారామన్ ఆలోచనలు ఉన్నాయని అందుకు బడ్జెట్‌లోని అంకెలే సాక్ష్యమన్న విమర్శకు సమాధానం లేని పరిస్థితి. గతంలో నిరుద్యోగ భృతి, యేటా రెండు కోట్ల ఉద్యోగాలంటూ చెప్పుకొచ్చిన బిజెపి ఇప్పుడు ఆ పరిస్థితి గురించి కనీసం మననం చేసుకోవడం లేదు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా రూపుదిద్దుకుని అమల్లోకి వచ్చిన జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీ ధర పెంపు కానీ, మరే ఇతర అంశాలు కానీ ప్రస్తావనకు రాకపోవడం శోచనీయం. వ్యవసాయ రంగం సంక్షోభం తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు పని దొరక్క పట్టణ బాట పట్టిన నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. సంఘటిత అసంఘటిత కార్మికులకు సంబంధించి సంక్షేమం ప్రస్తావనే లేదు. అసంఘటిత రంగంలో కూడా అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన వర్కర్లు సహా పలు రంగాలకు సంబంధించి సంక్షేమం, వేతనాల పెంపు గురించి ప్రస్తావనే లేదు. పైగా మా కోసం ఎవరు పనిచేస్తే వారి కోసం మేము పనిచేస్తామన్నట్లు బిజెపి తీరు ఉందని బడ్జెట్ తర్వాత అర్థమైంది. సంస్కరణాలను అమలుచేసే రాష్ట్రాలకు అదనపు నిధులు ఇస్తామని ప్రకటించడం రాజకీయ ఎత్తుగడేనన్న వాదన వినిపిస్తుంది. తెలంగాణ కేటాయింపుల విషయంలో అన్ని పార్టీలు పెదవి విరుస్తున్నాయి.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

తోడ్కా అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. దక్షిణ బస్తర్ డివిజన్ పరిధిలోని మావోయిస్టులు ఉన్నారనే పక్కా సమాచారం మేరకు డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్, కోబ్రా, సిఆర్‌ఎఫ్ సంయుక్త భద్రతా బలగాలు పెద్ద ఎత్తున కూంబింగ్ నిర్వహించారు. ఉదయం 9 గం. సమయంలో మావోయిస్టులు తారసపడటంతో ఇరు వర్గాల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యారు. సుమారు 5 గం.లకు పైగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఎనిమిది మంది మావోయిస్టులు హతమయ్యారు. అటువైగా కాల్పులు ఆగిపోవడంతో సంఘటనా స్థలంలో తనిఖీలు చేయగా మావోయిస్టుల మృత దేహాలతో పాటు పెద్ద ఎత్తున మందుగుండు సామాగ్రి, పేలుడు పదార్థాలు లభ్యమైనట్లు బీజాపూర్ జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ధృవీకరించారు. మరో ప్రక్క అక్కడే మావోయిస్టుల రహస్య స్థావరం బయటపడగా అందులో నుండి ఇన్సాస్ రైఫల్, బిజిఎల్ లాంఛర్‌ను స్వాదీనం చేసుకున్నారు. అడవుల్లోకి జారుకున్న మావోయిస్టుల కోసం భద్రతా బలగాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా హతమైన మావోయిస్టుల మృత దేహాలను పల్నార్ బేస్ క్యాంపుకు భద్రతా బలగాలు చేర్చాయి. అక్కడి నుండి శవ పరీక్షల నిమిత్తం జీజాపూర్‌కు తరలించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ ఏడాది జనవరి నెల్లో రెండు భారీ ఎన్ కౌంటర్‌లు చోటు చేసుకోగా పెద్ద ఎత్తున మావోయిస్టులు హతమయ్యారు. జనవరి 16న బీజాపూర్‌బాసగూడ అటవీ ప్రాంతంలో చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు హతమయ్యారు. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు మడివి హిడ్మా, తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ తృటిలో తప్పించుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐడి సుందరాజన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, జనవరి 21న గరియబాంద్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యులు చలపతి హతం కాగా ఆనాటు ఎన్‌కౌంటర్‌లో మొత్తం 16 మంది మావోయిస్టులు చనిపోయారు. తాజాగా ఇప్పుడు జరిగిన ఎదురు కాల్పుల్లో 8 మందితో సహా ఈ ఏడాది ఇప్పటి వరకు 36 మంది మావోయిస్టులు చనిపోగా, చాలామంది గాయాలపాలై తప్పించుకున్నట్లు తెలుస్తోంది. హిడ్మా, దామోదర్ టార్గెట్‌గా అడవుల్లో సుమారు 10వేల మంది సంయుక్త భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. మొత్తంగా ఛత్తీస్‌గఢ్ దక్షిణ అబూజ్‌మడ్ ప్రాంతంలో మావోయిస్టులు పట్టుకోల్పోతున్నట్లు తెలుస్తోంది. పామేడు,బాసగూడ,ఊసురు, గంగలూరు ప్రాంతాల్లో వారికి సహకారం తగ్గిపోవడంతో సమీపాన ఉన్న తెలంగాణ అటవీ ప్రాంతంలోనికి తలదాచుకునేందుకు వచ్చే అవకాశం ఉన్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో ఇటు ఛత్తీస్‌గడ్, అటు ఆంధ్రప్రదేశ్ పోలీసులు నిఘాను పెంచారు. 2026 మార్చి అఖరి నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించిన దరిమిలా అడవుల్లో పెద్ద ఎత్తున కూంబింగ్ అపరేషన్లు కొనసాగుతున్నాయి.

## ఘనంగా ప్రారంభమైన
# రామదాసు జయంతోత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

వారసుడు కంచర్ల శ్రీనివాస్‌తో ఇఓ ఎల్ రమాదేవి పూజలు చేసి గోదావరి మాతకు పసుపు,కుంకుమ, పుష్పాలతో పాటు వస్త్రాలను సమర్పించారు. అనంతరం నదీ జాలలను తీర్థబిందెలతో మేళతాళాల నడుమ తీసుకొచ్చి ఆలయంలో సంప్రోక్షణ చేసి ఆలయ ప్రాంగణంలో ఉన్న రామదాసు విగ్రహానికి అభిషేకం చేసి పుష్పాలను సమర్పించారు. అనంతరం రామదాసు చిత్రపటంతో నగర సంకీర్తన జరిపించారు. వాగ్గేయకారోత్సవాలను ఆలయ ఇఓ రమాదేవి ప్రారంభించారు. చిత్రకూట మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్దపూజలు జరిపించారు. అనంతరం రామదాసు కీర్తిని వివరిస్తూ ఆయన రామునిపై రాసిపాడిన నవరత్న గీతాల విశిష్టతను వివరించారు. అనంతరం రామదాసు నవరత్న కీర్తనలు ఏక కఠంతో వాగ్గేయ కారులు ఆలపించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం రామనామస్మరణతో మార్మోగింది. పలు ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున వాగ్గేయ కారోత్సవాలకు తరలివచ్చారు. ప్రముఖ సంగీత విద్యావంసులు మల్లాది సూరిబాబు, మల్లాది రవికుమార్ తదితర



ప్రముఖులు ఆలయ ప్రాంగణంలో రామనామ సంకీర్తలను ఆలపించారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకున్నారు

## స్కానింగ్ కేంద్రాలు చట్ట ప్రకారం నిర్వహించాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు చట్ట ప్రకారం నిర్వహించాలని అదనపు డిఎంఅండ్ హెచ్ ఓ డా.చైతన్య,మొహియుద్దీన్ సూచించారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని, ఎప్పటికప్పుడు రికార్డులను నిర్వహించాలని, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

## సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో
# న్యాయ విజ్ఞాన సదస్సు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో అన్నీఇంజనీరింగ్ బ్రాంచీలు, డిప్లొమా, మాస్టర్ అఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (యంబిఏ) విద్యార్థినీ, విద్యార్థులకు చట్టాలపై అవగాహన అనే అంశం పై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ వారి ఆదేశానుసారంగా శనివారం జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా యం. శ్రీనివాస్ ఆరవ అడిషనల్ డిస్టిక్ సెషన్స్ జడ్జి సత్తుపల్లి పాల్గొని చట్టాలపై విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ అక్షరాస్యత మరియు చట్టపరమైన అవగాహన కార్యక్రమం సమాజంలోని పేద మరియు వెనుకబడిన వర్గాలకు న్యాయ సేవలను కోరుకునే వారికి కల్పించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ విషసంస్కృతిని కఠినంగా అణచివేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి, సత్తుపల్లి న్యాయ సిబ్బంది, కళాశాల ఎన్‌యస్‌యస్ (ఎన్ఎస్ఎస్)విభాగం, అన్నీ ఇంజనీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు, కళాశాల యంబిఏ విభాగాధిపతి డాక్టర్ డియన్ వి.కృష్ణారెడ్డి,మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొన్న లారీ



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** ఆటోని ఢీ కొట్టి బొగ్గు టిప్పర్ బోల్తా కొట్టిన ఘటన శనివారం రుదరంపూర్ పార్క్ వద్ద జరిగింది. సత్తుపల్లి నుండి వస్తున్న బొగ్గులోడు టిప్పర్ ఫైవ్ ఇంక్లైన్ ఏరియాకి చెందిన వ్యక్తి ఆటోకి ఢీ కొట్టి, అదుపుతప్పి జాతీయ రహదారి పై బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ జాఫర్ స్వల్ప గాయాలతో తృటిలో తప్పించుకున్నాడు. ఈ ఘటనలో ఆటోతో పాటు రోడ్డు పక్కన పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనం నుజ్జునజ్జయింది. ఇదే ప్రాంతంలో వరుసగా ఆక్సిడెంట్ లు జరుగుతూ ఉండడంతో రుద్రంపూర్ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో పదుల సంఖ్యలో యాక్సిడెంట్లు జరిగాయి. నేషనల్ హైవే అధికారులు స్పందించి రుద్రంపూర్ పార్క్ ములమలుపు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని రుద్రంపూర్ ప్రజలు కోరుతున్నారు.

# అవగాహనతోనే తలసేమియాను అరికట్టవచ్చు

**-పెళ్లికి ముందు హెచ్‌బిఏ2 పరీక్షలు చేయించుకోవాలి**
**-సంకల్ప సంస్థ ఆధ్వర్యంలో తలసేమియా అవగాహన ర్యాలీ**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తలసేమియాపై అవగాహనతోనే ఈ వ్యాధిని అరికట్టవచ్చునని ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల సూపరింటెండెంట్ ఎల్. కిరణ్‌కుమార్ తెలిపారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం నగరంలో తలసేమియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెవిలియన్ మైదానం నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి వరకు నిర్వహించిన ఈ ర్యాలీని వైద్య కళాశాల సూపరింటెండెంట్ ఎల్. కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ గత 15 సంవత్సరాలుగా తలసేమియా చిన్నారుల కోసం పనిచేయడం అభినందనీయమన్నారు. జిల్లాలో 500 మంది తలసేమియా చిన్నారులు ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారని ఆ చిన్నారుల చిరునవ్వు చూస్తుంటే తనకు సంతోషంగా ఉందన్నారు. ఈ చిరునవ్వు వెనక ఉన్న బాధను అందరూ గ్రహించాలన్నారు. తలసేమియా రక్తసంబంధ వ్యాధి అని ప్రస్తుతం ఈ వ్యాధి నియంత్రణకు అనేక అధునీక వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. అందులో బోన్‌మారో మార్పిడి ఒకటన్నారు. పిల్లలకు వ్యాధి రాకుండా ఉండేందుకు పెళ్లికి ముందే హెచ్‌బిఏ2 పరీక్షలు చేయించుకోవడం మంచిదని, జనటిక్ కౌన్సిలింగ్ ముఖ్యమైందన్నారు. ఈ పరీక్ష చేయించుకుంటే వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవచ్చునని తెలిపారు. తలసేమియా చిన్నారులను ఆదరించాలని చికిత్స విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నారులను ఈ వ్యాధుల నుండి కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అవగాహనతోనే ఈ వ్యాధిని అరికట్టవచ్చునని తెలిపారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ తలసేమియాపై ప్రజల్లో అవగాహన తక్కువగా ఉందన్నారు. ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తే దీనిని నియంత్రించవచ్చునన్నారు. ఇతర రాష్ట్రాల్లో తలసేమియా చిన్నారులను వికలాంగులుగా గుర్తిస్తున్నారని మన రాష్ట్రంలో కూడా వికలాంగులుగా గుర్తించి సదరం సర్టిఫికెట్లు అందించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందించాలని నిర్వాహకులకు సూచించారు. వీరికి నెలకు రూ. 4వేల పింఛన్ అందితే వారికి అండగా ఉంటుందని ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా వీరికి చికిత్సలు అందిస్తామని రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సంస్థ బాధ్యులు పొద్దుటూరి అనిత మాట్లాడుతూ తలసేమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ చర్చించుకుని, వ్యాధిని నివారించడమే తమ సంస్థ లక్ష్యమని ఆమె తెలిపారు. 14 మంది చిన్నారులకు సంస్థ ఆధ్వర్యంలో బోన్‌మారో చికిత్స చేయించామని 12 మంది పిల్లలు విజయవంతంగా తలసేమియా రహిత పిల్లలుగా మారారన్నారు. ఈ వ్యాధిని అరికట్టేందుకు సమాజంలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల డిప్యూటీ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, వైద్యులు నారాయణమూర్తి, లక్ష్మి దీప, సంస్థ బాధ్యులు పావని, ఉదయ్‌భాస్కర్, రవిచందర్, వంశీ కిరిటీ, ఉపేందర్, అనురాధ తదితరులు పాల్గొన్నారు. తలసేమియా చిన్నారులు పులిపాటి ప్రసాద్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జేబిఎం సంస్థకు 61 మంది విద్యార్థులు ఎంపిక



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రముఖ అంతర్జాతీయ ఆటో రంగ సంస్థ జేబిఎం గ్రూప్ సంస్థకు ఎస్‌బిఐటి కళాశాలకు చెందిన 61 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఆటో రంగంలో పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా ఎంపికైన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని కృష్ణ అభిప్రాయ పడ్డారు. శనివారం కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని వారు సూచించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ 37 దేశాల్లో విస్తరించి ఉన్న జేబిఎం సంస్థ తమ కళాశాల విద్యార్థులను ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వివిధ దశల్లో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వార్షిక ఆదాయం రెండు లక్షలకు పైగా ఉంటుందని ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ట్రైనీ ఇంజనీర్ ఉద్యోగానికి గాను నిర్వహించిన నియామకాల్లో ఈఈఈ, ఈసిఈ విద్యార్థులకు అవకాశం కల్పించామని ఆయన తెలిపారు. ఆటో రంగం బస్సులు, ఎలక్ట్రిక్ వెహికిల్స్ తయారీలో అంతర్జాతీయంగా విస్తరించిన జేబిఎం సంస్థ తమ విద్యార్థులను ఎంపిక చేయడం సదావకాశమన్నారు. భవిష్యత్తు ఎలక్ట్రిక్ వాహనాలదేనని రవాణా రంగంలో మరిన్ని ఆవిష్కరణలు రానున్నాయన్నారు. ఎంపికైన విద్యార్థులను ఈ సందర్భంగా వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో జేబిఎం సంస్థ హెచ్‌ఆర్ హెడ్ బి. ప్రేమానాథ్, అసిస్టెంట్ మేనేజర్ పురుషోత్తం, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జే. రవీంద్రబాబు, ఎన్. శ్రీనివాసరావు, టిపివో ఎన్. సవిత, కో ఆర్డినేటర్ జి. ప్రభాకర్ పాల్గొన్నారు.

# ప్రమాదానికి గురైన వ్యవసాయ కూలీలను ప్రభుత్వమే ఆదుకోవాలి

**-తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పగిడిపల్లి, తాటి**



**ప్రజాపక్షం/బోనకల్‌:** మండల కేంద్రంలో ట్రాక్టరు పల్టికొట్టి ప్రమాద గురైన వ్యవసాయ కూలీలను ప్రభుత్వమే ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పగిడిపల్లి యేసు, తాటి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్‌కు ప్రమాదానికి గురైన వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని బికెఎంయు ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదంతో నిత్యం కూలీ చేసుకునే వ్యవసాయ కూలీల కుటుంబాలలో విశాదఛాయలు అలుముకున్నాయని తెలిపారు. ఇక తీవ్ర ప్రమాదానికి గురైనవారు కొలుకోవడానికి నెలలు పడుతుందని, దీంతో వారి ఆర్థికపరిస్థితి దుర్భరంగా మారిందని అన్నారు. ఈ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యవసాయకూలీల ముఠామేస్త్రీ యార్లగడ్డ వరమ్మకు రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, తీవ్రగాయాల బాధితులకు కొలుకునేంతవరకు జీవనభృతి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, సంఘం నాయకులు బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, కొంగర భాస్కరరావు, గుంపుల జయరాజు, టిడిపి రైతు సంఘం నాయకులు గొల్లపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

**-వరమ్మ కుటుంబానికి పరామర్శ...**



ట్రాక్టర్ పల్టికొట్టిన ప్రమాదంలో బోనకల్‌కు చెందిన మృతురాలు యార్లగడ్డ వరమ్మ కుటుంబాన్ని బికెఎంయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పగిడిపల్లి యేసు, తాటి వెంకటేశ్వరరావులను శనివారం పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వరమ్మకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వరమ్మకు కుమారుడు యార్లగడ్డ శ్రీనివాసరావు మండల ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రభ రిపోర్టర్‌గా పని చేస్తున్నారు.

# అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల విరతణ



**ప్రజాపక్షం/ఖమ్మం :** సన్‌రైజ్ అభ్యుదయ సేవా సంస్థ (వైరా) ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని చర్చి కాంపౌండ్ ఏరియా ముత్యాలమ్మ గుడి సెంటర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రానికి శనివారం కుర్చీలు వితరణ చేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు ఏనుగు సుమన్‌బాబు మాట్లాడుతూ ఏనుగు శివ రాఘవ ఆర్థిక సాయంతో పిల్లలకు చైర్స్, గర్భిణీలకు, బాలింతలకు కుర్చీలు అందించడం జరిగిందన్నారు. శివ రాఘవ తన సోదరి ఏనుగు శ్రావ్యచౌదరి పుట్టిన రోజు సందర్భంగా వితరణ చేసినట్లు ఆయన తెలిపారు. అంగన్‌వాడీల అభివృద్ధి, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సన్‌రైజ్ సంస్థ ప్రాధాన్యత నిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో సన్‌రైజ్ సంస్థ సభ్యులు ఎంపి దాస్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షునిగా ప్రసాద్





**ప్రజాపక్షం/ మధిర :** కాంగ్రెస్ పార్టీ సామాజిక విభాగాల అధ్యక్షుల నియామకాల కార్యక్రమంలో భాగంగా పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షునిగా సజ్జ ప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బాణావత్ రమణనాయక్ సమక్షంలో మండల పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ నియామక ఉత్తర్వులు అందచేశారు. ఈసందర్భంగా సూరంశెట్టి మాట్లాడుతూ డిప్యూటీ సిఎం, మధిర శాసనసభ్యులు మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు నియామకం చేపట్టడం జరిగిందని అన్నారు. పార్టీని బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలను పటిష్టం చేయటం జరుగుతుందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపాలిటీ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షునిగా నియాకమైన సజ్జ ప్రసాద్ మాట్లాడుతూ తనకు ఈ పదవి రావటానికి కృషి చేసిన డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, ఇతర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకిచ్చిన పదవికి న్యాయం చేస్తానని, పార్టీ గెలుపులో కీలకపాత్ర పోషిస్తానని ప్రసాద్ పేర్కొన్నారు.

# ఉపాధి హామీ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉపాధిహామీ సిబ్బందికి గత మూడు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించడం లేదని, కుటుంబపోషణ కూడా భారంగా ఉందని, ప్రభుత్వం స్పందించి మూడు నెలల జీతాలు వెంటనే విడుదల చేయాలని ఖమ్మం జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆవుల సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో ఎంపిడిఓ బి.వెంకటేశ్వర్లుకు ఉద్యోగులందరూ కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాన్ని వెంటనే విడుదల చేసే విధంగా ప్రభుత్వానికి సిఫార్సులను పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఓ సూదిని జానకిరామిరెడ్డి, జెఇ బొల్లెద్దు విజయ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, రేలచర్ల అనీల్‌కుమార్, బోడేపూడి వాణి, గుజ్జర్లపూడి శాంతయ్య, కంప్యూటర్ ఆపరేటర్లు సుగ్గల గిరీష్, అదరం సుజాతలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి భద్రత చెక్ అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** సత్తుపల్లి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కానిస్టేబుల్ పి.వెంకటకృష్ణ కుటుంబ సభ్యులకు పోలీసుశాఖ నుంచి అందజేయవలసిన భద్రత, ఎక్స్‌గ్రేషియా నగదు ఏడులక్షల తొంబైతొమ్మిది వేల రూపాయల చెక్‌ను పోలీసు కమిషనర్ సునిల్‌దత్ శనివారం తన కార్యాలయంలో మృతుని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీశాఖలో పనిచేస్తూ అకాల మరణం పొందిన వారికి శాఖపరంగా అన్నిరకాల సహాయసహకారాలు అందజేసి అండగా నిలుస్తామన్నారు.

# గద్దల రమేష్‌కు నివాళులర్పించిన దయానంద్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మండలం, సిద్ధారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త గద్దల రమేష్ అనారోగ్యంతో మరణించగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ వారి పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనందబాబు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, మహమ్మద్ కమల్ పాషా, మట్టా చెన్నారావు, గొల్లముడ్డి మధు, రఫీ మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మాజీ అకాల మరణం సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/అశ్వాపురం/మణుగూరు :** మొండికుంట గ్రామానికి చెందిన సిపిఐ మండల సీనియర్ నాయకులు గణేశుల అమ్మాజీ మరణించిన విషయం తెలుసుకుని శనివారం వారి నివాసానికి వెళ్లి సిపిఐ నాయకులు పార్థివదేహానికి అరుణ పతాకం కప్పి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



పేద ప్రజల కోసం అనేక ఉద్యమాలు చేసి, ఎన్ని ఒడిదుడుకులు వచ్చిన కమ్యూనిస్టు పార్టీలోనే వారి జీవితాంతం పని చేశారన్నారు. వారి సేవలు కమ్యూనిస్టు పార్టీ మర్చిపోలేదని, వారి మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. నివాళులర్పించి వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వర రావు, సిపిఐ అశ్వాపురం మండల కార్యదర్శి అనంతనేని సురేష్, నెల్లిపాక సొసైటీ వైస్ ఛైర్మన్ కమటం సురేష్, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు కొండపర్తి ప్రసాద్, దంతాల జగదీష్, దండి నాగేష్, ఏఐటియూసి మండల అధ్యక్షులు రాయపూడి రాజేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈనపెల్లి పవన్ సాయి, మొండికుంట బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సర్వ కృష్ణ, పశుల ప్రభాకర్, పూర్వం సంతోష్, ప్రజాప్రతినిధులు, సిపిఐ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో జీతాలు ఇప్పించండి



**ప్రజాపక్షం/చంద్రుగొండ :** తమకు మూడు నెలల నుండి జీతాలు లేక నానా అవస్థలు పడుతున్నామని తమ దీర్ఘకాలిక ఉద్యోగ భద్రత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం మండలంలో ఉపాధి హామీ పథకంలోని ఉద్యోగులు ఎంపీడీవో అశోక్‌కి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేసి పెన్ డౌన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ తక్షణం పెండింగ్ జీతాలు విడుదల చేయాలని తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. లేనియెడల దశల వారీగా ఆందోళన చేపడుతావని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీవో శ్రీనివాస్, కంప్యూటర్ ఆపరేటర్లు ఈసీలు తదితరులు పాల్గొన్నారు.

## మంగాయమ్మకు ఎమ్మెల్యే నివాళి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి) సబ్బతి విష్ణుమూర్తి మరియు సీనియర్ పాత్రికేయులు శివమూర్తి తల్లి మంగాయమ్మ అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న స్థానిక వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌తో పాటు చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్, వర్ధన్నపేట శాసనసభ్యులు నాగరాజులు తదితరులు మంగాయమ్మ భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ళ వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# టిఎన్‌టియుసి గెలుపు కార్మికుల విజయం

**-మంచిని గుర్తించి మళ్లీ గెలిపించారు**
**-ఐటిసి పేపర్ బోర్డులో 8 సార్లు జెండా ఎగరవేసిన టిఎన్‌టియుసి**
**-రానున్న రోజుల్లో మరికొన్ని పర్మినెంట్ ఉద్యోగాలు ఇస్తాం**
**-టిఎన్‌టియుసి అధ్యక్షులు హరిప్రసాద్**






**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఐటిసిలో ఉత్కంఠ భరితంగా జరిగిన ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో 60 ఓట్లు మెజారిటీతో టిఎన్‌టియుసి మిత్రపక్షాలు విజయం సాధించడంతో కార్మికులు గెలిచారని టిఎన్‌టియుసి అధ్యక్షులు కనకమేడల హరిప్రసాద్ అన్నారు. శనివారం సారపాక పట్టణం టిఎన్‌టియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐటిసి కంపెనీ స్థాపించిన నాటి నుండి నేటి వరకు సుమారు 8 సార్లు టిఎన్‌టియుసి మిత్రపక్షాలు విజయం సాధించారని గుర్తు చేశారు. గత ఎన్నికల సమయంలో రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా టిఎన్‌టియుసి గెలిచిందని, అదే విధంగా ప్రస్తుతం కాంగ్రెస్ ఉన్న తిరిగి టిఎన్‌టియుసికే కార్మికులు పట్టం కట్టారని గుర్తు చేశారు. టిఎన్‌టియుసి మిత్రపక్షాలు అన్ని వర్గాలకు అండగా ఉండే విధంగా మిత్రులని కలుపుకొని గత 13వ వేతనం ఒప్పందం నూరు శాతం అమలు చేసి ఎన్నికలకు వెళ్లడంతో నేడు 14వ వేతన ఒప్పందంలో మళ్లీ గెలిపిచామన్నారు. కార్మికులు మంచిని గుర్తించి మళ్లీ పట్టం కట్టారని, అలాగే కార్మికుల సంక్షేమం కోసం అహర్నిశలు 24 గంటలు అందుబాటులో ఉండి ప్రతి కార్మికుని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తామని అన్నారు. ఉత్కంఠ భరితంగా నడిచిన ఎన్నికలలో కార్మికులు టిఎన్‌టియుసికి అండగా నిలబడి గత పది రోజులుగా చేసిన కృషి ఎప్పటికీ మరిచిపోలేనని అన్నారు. తన విజయంలో తోడ్పాటును అందించిన ప్రతి కార్మికుడికి రుణపడి ఉంటానని అన్నారు. టిఎన్‌టియుసికి వైయస్సార్ ట్రేడ్ యూనియన్ ఎప్పటికీ అండగా నిలబడుతూ దానితో పాటు భద్రాద్రి ఎంప్లాయిస్ యూనియన్, ప్రజానాడు ఎంప్లాయిస్ యూనియన్ అండా నిలబడ్డారని గుర్తు చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పెద్దలు ఐఎన్‌టియుసి పక్షాన ప్రచారం నిర్వహించినా కార్మికులు ఐఎన్‌టియుసిని తిరస్కరించి టిఎన్‌టియుసి మిత్రపక్షాలకు మద్దతు పలకటం మా విజయానికి దోహదపడ్డాయన్నారు. సమర్థవంతమైన నాయకున్ని ఎన్నుకోవడంలో కార్మికులు విజయం సాధించారని గుర్తు చేశారు. అంతకు ముందు రాష్ట్ర టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఐటిసి అభివృద్ధి, కార్మికులకు నిత్యం అండగా ఉండే టిఎన్‌టియుసికి పట్టం కట్టడం సంతోషంగా ఉందన్నారు. యువతరంలో టిఎన్‌టియుసి మిత్రపక్షాల విజయ దుందుభి మోగించడం కార్మికుల విజయానికి నాంది అన్నారు. ఎన్నికల ముందు ఆగినటువంటి పర్మినెంట్ ఉద్యోగాలు తిరిగి ఉద్యోగ అవకాశాలు ఇవ్వటానికి టిఎన్‌టియుసి మిత్రపక్షాలు కృషి ఉంటుందన్నారు. ఐటిసిలో గెలిచిన టిఎన్‌టియుసి మిత్రపక్షాల యూనియన్‌తో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీలో నూతన ఉత్తేజాన్ని నింపిందన్నారు. తెలుగుదేశం పార్టీ వైపు యువతరం ఎక్కువ మక్కువ చేపుతుందని గుర్తు చేశారు. టిఎన్‌టియుసి మిత్రపక్షాల విజయం ఐటిసి అభివృద్ధికి, ఐటిసిలో పని చేస్తున్న కార్మికులకు సంక్షేమ ఫలాలు అందించడంలో నాయకత్వం కృత నిశ్చయంతో పని చేస్తే కార్మికులకు అండగా నిలబడుతుందని అన్నారు. గెలిపించిన ప్రతి కార్మికులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో టిఎన్‌టియూసి రాష్ట్ర జనరల్ సెక్రటరీ రత్నాకర్, టిఎన్‌టియుసి ఛైర్మన్ గల్లా నాగభూషయ్య, వైయస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు, టిఎన్‌టియుసి మిత్రపక్షాల ప్రధాన కార్యదర్శి రామకోటిరెడ్డి, టిఎన్‌టియుసి మిత్రపక్షాల నాయకులు జీవన్‌రెడ్డి, కర్రీ రాజేంద్రప్రసాద్, రెడ్డెం నరసింహారెడ్డి, బెల్లకొండ భాస్కరరావు, చావ మహేశ్వరరావు, సైదేశ్వరరావు, పిడుగు కొండల్‌రావు, నాయకులు దుగ్గింపుడి శేషురెడ్డి, నరసింహారావు, సంజీవరావు, పెరుగు నాగేశ్వరరావు, సత్యనారాయణ, గోనెల సర్వేశ్వరరావు, హరిప్రసాద్, మిరియాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్లపై వేలాడుతున్న యమపాశాలు..!

**-ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు..**
**-ప్రాణాలుపోతే స్పందిస్తారా.. అంటూ కాలనీ వాసుల ఆగ్రహం**







**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల పరిధిలోని కాకర్ల గ్రామ పంచాయితీలోని ఎస్సీ కాలనీలో ఇండ్లపై విద్యుత్ లైన్లు యమపాశాల్లా వేలాడుతూ ప్రమాధ భరితంగా మారాయి. ఏ క్షణంలో ఎటు నుంచి ఏ ప్రమాదం పొంచుకొని వస్తుందో తెలియక కాలనీ వాసులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. వేలాడుతున్న విద్యుత్ వైర్లను వెదురు గడలకు కట్టి సర్కస్ ఫీట్లను తలపించేలా వేలాడ దీశారు. ఇండ్ల ముందు సైతం చేతికి అందే ఎత్తులో విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాధ భరితంగా మారడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నట్లు కాలనీ వాసులు పేర్కొంటున్నారు. స్లాబులపై వేళాడుతున్న వైర్లు ఎప్పుడు తెగి మీదపడతాయో తెలియని పరిస్థితుల్లో ఉన్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. గతంలో గాలి వీస్తే వైర్లు కలిసి వరి గడ్డివాములు, పూరి గుడిసెలు సైతం అగ్నికి ఆహుతి కావడంతోపాటు పలు ప్రమాదాలు జరిగినా అధికారులు స్పందిండం లేదని పేర్కొన్నారు. కాలనీలోని ఇండ్ల స్లాబ్‌లపై వేళాడుతున్న విద్యుత్ వైర్లు మార్చాలని అనేక మార్లు అధికారులకు విన్నవించామని స్థంబాలను మార్చేందుకు అవసరమైన నిధులు మీరే సమకూర్చాలని పేర్కోవడంతో భయం గుప్పెట్లో కాలం వెల్లదీస్తున్నట్లు కాలనీ వాసులు తెలిపారు. విద్యుత్ వైర్లు, స్థంబాలకు పిచ్చి తీగెలు సోకి ప్రమాద భరితంగా మారాయని విద్యుత్ శాఖాధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## కవితా నాయుడుకి సన్మానం




**ప్రజాపక్షం/కొత్తగూడం టౌన్ :** సింగరేణి జి.ఎం.పర్సనల్ ఐ.ఆర్.పి.ఎం కవిత నాయుడు జిఎం పర్సనల్ వెల్ఫేర్‌గా అదనపు భాధ్యతలను ఇచ్చిన సందర్భంగా శనివారం రోజు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సలహాదారులు దమ్మాలపాటి శేషయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి తదితర యూనియన్ నాయకులు సన్మానించినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నీతి నిజాయితీగా జి.ఎం పర్సనల్ ఐ ఆర్ పి.ఎం గా పనిచేస్తున్న కవిత నాయుడు జి.ఎం పర్సనల్ వెల్ఫేర్ బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వహిస్తూ కార్మికుల సమస్యలను పరిస్కరిస్తారని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్పొరేట్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ క్రిస్టోఫర్, బ్రాంచ్ సహాయ కార్యదర్శి ఎస్.రాము, వివిద డిపార్ట్మెంట్ల పిట్ కార్యదర్శులు టి.నాగయ్య, రామ్ శంకర్, సుధీర్, బొంతు శ్రీను, నితిన్, శ్యామ్, రామకృష్ణ, రబ్బని, సుష్మా, జీడి రమేశ్, రవీందర్, బొట్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు సబ్సిడీ లోన్లు

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** దివ్యాంగుల కు ఈ ఆర్థిక సంవత్సరమునకు గాను ఆర్థిక పునరావాస పథకం ద్వారా స్వయం ఉపాధి, పునరావాసం, చేతి వృత్తులు, కుటీర పరిశ్రమలు నిర్మించుకొనుటకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 23 మండలాలు, 4 మున్సిపాలిటీలకు 100 రాయితీతో 50,000 వేల చొప్పున, మండలానికి, మునిసిపాలిటికి ఒక యూనిట్ చొప్పున మొత్తం 26 యూనిట్లకు గాను పూర్తి సబ్సిడీ ఋణాలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులుదరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 12 వ తేదీ వరకు పొడగించడం జరిగిందనీ అన్నారు. మహిళ, శిశు, దివ్యాంగుల ,వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లేనిన ఒక ప్రకటనలో తెలిపారు.

# ఇది హరిత కలెక్టరేట్

**-ఎటు చూసినా పచ్చదనమే..**
**-గార్డెనింగ్‌తో ప్రత్యేక శోభ**
**-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేక దృష్టి**











**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కలెక్టరేట్ పచ్చదనం, పరిశుభ్రతతో హరిత శోభను సంతరించుకుంది. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేక శ్రద్ధతో సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పచ్చదనం, ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా కార్యాచరణ చేపట్టారు. వివిధ రకాల మొక్కల పెంపకం, గార్డెనింగ్, కలెక్టర్ చాంబర్ పక్కన, ప్రవేశం వద్ద, వివిధ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన మొక్కల కుండీలతో కలెక్టరేట్ సుందరంగా తయారై సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తుంది. పచ్చదనంతో పాటు కలెక్టరేట్‌కు వచ్చే వారికి ఆహ్లాదకర వాతావరణం ఉండేవిధంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మొక్కల పెంపకంతో పాటు గార్డెనింగ్ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కలెక్టరేట్‌లోని ఫౌంటెన్ చుట్టూ, ఆవరణ చుట్టూ అలంకరణ మొక్కలతో పాటు పూల మొక్కలను, కుండీలను ఏర్పాటు చేశారు. కార్యాలయం లోపల, బయట ఆవరణలో ఏర్పాటు చేసిన గార్డెనింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

### 12వేల మొక్కలు ఏర్పాటు....

కలెక్టరేట్‌కు వచ్చే సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచేలా పోయిన్సెట్టియా రెడ్, మినీ ఇగ్సోర, టోపియరీ ఫికస్ బ్లాక్, అరెకా పామ్, సైకస్, పెన్సిల్ పెయిన్, హేలికొనియా ఆరంజ్, కోలియస్ రెడ్, బ్లాకు ఏరాంతము, దేనేలియ వేరిగేటెడ్, ట్యూబ్ రోజ్, డబుల్ ఫ్లవర్, ట్యూబ్ రోజ్ సింగిల్ ఫ్లవర్, లెమన్ గ్రాస్, క్రీపర్, ఆగ్లోనియ, చైనా బాక్స్, క్రైసాంతిమం, హైబ్రిడ్ రోజ్, రాయల్ పామ్, గోల్డెన్ దురంత, రాధర్ మాచెర వంటి వివిధ రకాలు సుమారు 12వేల మొక్కలను కలెక్టరేట్‌లో నాటారు. కలెక్టరేట్ భవనం మధ్యలో అందమైన ఆకృతిలో పచ్చిక పూల మొక్కలను ఫౌంటెన్ చుట్టూ అద్భుతంగా నాటారు. పచ్చదనంతో , గార్డెనింగ్‌తో కలెక్టరేట్ నూతన శోభను సంతరించుకుని సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతుంది.

### పర్యావరణ పరిరక్షణకు చర్యలు : కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్ పరిసరాల్లో మొక్కల పెంపకంతో పాటు గార్డెనింగ్ ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్‌కు వచ్చే సందర్శకులకు ఆహ్లాదాన్ని కలిగించడంతో పాటు మానసిక ప్రశాంతతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని ఆయన తెలిపారు. భవిష్యత్తుతరాల మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సరంక్షించాలని ఆయన కోరారు.

# కాంగ్రెస్ మోసాలను ప్రజల్లో ఎండగట్టాలి

**-బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఏ రేగా**



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** కాంగ్రెస్ మోసాలను ప్రజల్లో ఎండగట్టాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఏ రేగా కాంతారావు ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని మర్కోడ్ పంచాయితీ సుద్ధరేవు గ్రామంలో మణుగూరు ఏఈఓగా విధులను నిర్వహిస్తున్న కొమరం లక్ష్మణరావు మాతృమూర్తి మృతి చెందారు. రామంజిగూడెం పంచాయితీ తునికిబండ్ల గ్రామం సీనియర్ నాయకులు గుగ్గేల లక్ష్మయ్య తండ్రి దశ దిన కర్మలకు హాజరై, వారి కుటుంబాలను పరామర్శించారు. అనంతరం మండల కేంద్రం ఆళ్లపల్లిలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పాయం నరసింహారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు 6 గ్యారంటీలో అమలు చేస్తామని చెప్పి, అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విస్మరించిందన్నారు. చిన్న గ్రామ పంచాయితీలను సంక్షేమ పథకాలను అందించడం కోసం ఎంపిక చేసుకోవడం ఈ ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గ్రామ సభల్లో ప్రజలు ఎక్కడికి ఎక్కడ నిలదీస్తున్నారన్న నిలదీశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చి బద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ఈడి దాడుల్లోమంత్రి పొంగులేటి ఇంట్లో పట్టుబడిన డబ్బులు ఎక్కడికి వెళ్లాయో కేంద్ర ప్రభుత్వం సమాచారం ఇవ్వడం లేదని ప్రజల పక్షాన ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటి వరకు రైతు భరోసా ఇవ్వలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణకు నోచుకునే హామీల గురించి ప్రజాక్షేత్రంలో గ్రామ సభలో ప్రశ్నించిన వారిపై భౌతికంగా దాడులకు పాల్పడడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి హనుమంతరావు, మాజీ ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి, పిఏసిఎస్ ఛైర్మన్ గుగ్గేల రామయ్య, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పాయం నరసింహారావు, ప్రధాన కార్యదర్శి షేక్ బాబా, నాయకులు మహమ్మద్ ఖయ్యూం, సతీష్, ఆదామ్, సత్యం, సాంబశివరావు, నరసింహారావు, శ్రీను, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కలుషితం కాకుండా చర్యలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి ని అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. మండలంలోని కొత్తకొత్తూరు, తిరుమలాపురం, నేలకొండపల్లి, నాచేపల్లి తదితర గ్రామాలలో శనివారం అధికారుల బృందం పర్యటించారు. ఆర్ డబ్ల్యు ఎస్ డీఈఈ ఓం ప్రకాష్, ఎంపీడీఓ యం.యర్రయ్య, తహశీల్దార్ జె.మానిక్రావ్ లు పరిశీలించారు. వాటర్ ట్యాంక్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు ట్యాంకులు ఎక్కి పరిశుభ్రతను పరిశీలించారు. బ్లీచింగ్ కలిపే విధానం+ పంపు ఆపరేటర్ల ను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో తాగునీటి సమస్యలు, వాటి పరిష్కారం గురించి స్థానికులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేసవి సమీపిస్తున్నందున్న ప్రజలు తాగునీటి సమస్యను అధిగమించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నటు పేర్కోన్నారు. తాగునీటి కలుపితం కాకుండా తగినచర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడా లీక్ లు లేకుండా ఎప్పటికప్పుడు అప్రమతంగా ఉండాలని ఆదేశించారు. తిరుమలాపురంతండా లో మంచినీటి కోసం గ్రామస్తులు ఆందోళన చేయటంతో వాటి పరిష్కారం కోరకు వెళ్లి ప్రత్యామ్నయ మార్గాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, ఆయా పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## రామదాసు జయంతి ఉత్సవాలు ప్రారంభం




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పరమ భక్తగ్రేసరుడు కంచర్ల గోపన్న (భక్తరామదాసు) జయంతి ఉత్సవాలు ధ్యాన మందిరంలో ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలలో భాగంగా తొలి రోజు భద్రాచలం దేవస్థానం ఏఈవో బీ.రామకృష్ణ ప్రారంభించారు. అంతకు ముందు గోపూజ, మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలో నగర సంకీర్తన చేశారు. అనంతరం నూతన ఆడిటోరియంలో రామదాసు సంకీర్తనలు, విష్ణు సహాస్రనామ పారాయణ, సంగీత కచేరీ కార్యక్రమాలు చేపట్టారు. నేలకొండపల్లి యువత ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రామదాసు విగ్రహాం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, విద్వత్ కళాపీఠం ప్రతినిధులు రాధాకృష్ణమూర్తి, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు జెర్రిపోతుల అంజి, బచ్చలకూరి నాగరాజా, మామిడి వెంకన్న, జెరిపోతుల సత్యనారాయణ, మోర మల్లయ్య సామల కోటేశ్వరరావు, కడియాల నరేష్, మాదాసు ఆదం తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా విగ్రహాల ఊరేగింపు జలబిందెలతో మహిళలు భారీ ప్రదర్శన



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని కోనాయిగూడెం లో చిట్టి ఆంజనేయస్వామి దేవాలయం లో ధ్వజస్థంభం ప్రతిష్ట మహోత్సవం లో భాగంగా శనివారం ఆంజనేయ స్వామి విగ్రహాలు, ధ్వజస్థంభం కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహిళలు ఆటా, పాటలతో గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం ప్రతిష్టించనున్న దృజస్థంభం కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు జలబిందెలతో బారీ ప్రదర్శన చేపట్టారు. జై శ్రీరామ, శ్రీ ఆంజనేయస్వామి నినాదాలతో గ్రామం మారుమోగింది. సాయంత్ర బలిహారణ కార్యక్రమం సందర్భంగా యువత కర్రలు పట్టుకుని కాపాలా కాచారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఇంగువ రామకృష్ణ. మాజీ సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, గ్రామ పెద్దలు పగడాల సైదులు, తిగ్గుళ్ళ భాస్కర్, మేకల వేంకటేశ్వర్లు, కొచ్చేర్ల నాగేశ్వరరావు, శ్రీనివాస్ రావు, తొట సురేష్, పెంటమళ్ల ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు

**-జిల్లా అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లాలో పులి గుండాల చెరువు వద్ద ఏకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ తెలిపారు. శనివారం అటవీ శాఖా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు జిల్లాలోని సంబంధిత శాఖలతో కలిపి ఒక పర్యాటక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పులిగుండాల ఏకో టూరిజం ప్రాంతాన్ని స్థిరమైన పర్యాటక కేంద్రంగా రూపుదిద్దేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. పులిగుండాల చెరువు వద్ద బోటింగ్, పక్షులను వీక్షించేందుకు ట్రెక్కింగ్, రాత్రి సమయంలో నక్షత్రాల వీక్షణ కొరకు అటవీ ప్రాంతంలో క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటి ద్వారా అడవిలో సఫారీ చేయుట, వృక్షజాలం, జంతుజాలం గురించి అధ్యయనం చేయడానికి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఏకో టూరిజం అభివృద్ధితో పర్యాటకులు పెరగడమే కాకుండా అక్కడ ఉన్న స్థానికులకు ఉపాధి, ఆదాయ వనరులు పెరుగుతాయన్నారు. అటవీ, వన్యప్రాణ సంరక్షణపై ప్రజలకు అవగాహన పెరిగి అటవీ రక్షణ పటిష్టంగా అమలయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఏకో టూరిజం అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ, జెడ్పిసిఈవో దీక్షారైనా, చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ మంజుల, ఏసిఎఫ్, సత్తుపల్లి ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ జి. ఉమ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తల్లాడ అటవీ రేంజ్ అధికారులు ఇటీవల పులిగుండాల ఏకో టూరిజం ప్రాంతాన్ని సందర్శించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అటవీ శాఖాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య




**ప్రజాపక్షం/ మధిర :** ప్రభుత్వ కళాశాలల్లోనే అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటం జరుగుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ కళాశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి సూచించారు. 202526 విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం సిరిపురం, ఎర్రుపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, బనిగండ్లపాడు డిగ్రీ కళాశాల ప్రవేశాలపై శనివారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ కళాశాలల్లో ఉత్తమ నైపుణ్యం కలిగిన బోధకులు ఉన్నారని, బిఎ, బికాం, బిఎస్సీ లైఫ్ సైన్స్, ఫిజికల్ సైన్స్ గ్రూపులు, జనరల్, కంప్యూటర్ కోర్సులు ఉన్నాయని, కళాశాలకు అందుబాటులో హాస్టల్ సౌకర్యం, ఆహ్లాదకరమైన వాతావరణం, విశాలమైన క్రీడా స్థలం తదితర సదుపాయాలు ఉన్నాయని, విద్యార్థులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాలల్లో అడ్మిషన్ల కోసం దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.అరుణ, ఎస్. ఇందిర, పి.సుజాత, ఎస్కె అఫ్రోజ్, అనిత, జ్యోతి, వెంకటలక్ష్మి , మాధురి, సురేష్, హరిక, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# పంటల నమోదు సమగ్రంగా ఉండాలి

**-డిజిటల్ క్రాప్ నమోదును పరిశీలించిన డిఏవో**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పంటల నమోదు సమగ్రంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య తెలిపారు. శనివారం రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం క్లస్టర్ గణేశ్వరం గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య పర్యటించి డిజిటల్ క్రాప్ బుకింగ్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో క్లస్టర్ స్థాయిలో పంటల నమోదు సమగ్రంగా ఉండాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రైతులు పండించిన పంటల విక్రయాలకు ఈ పంట నమోదు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక యాప్ ద్వారా డిజిటల్ క్రాప్ నమోదు ఎలా చేస్తున్నది పరిశీలించారు. అనంతరం రైతులు సాగు చేసిన పెసర, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో టెక్నికల్ పవన్, ప్రత్యూష, ఏఈవో శిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

# మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు విలవిల



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మిర్చి ధర రోజు రోజుకు పడిపోతుండడంతో మిర్చి పంట పండించే రైతులు గిట్టుబాటు ధర లేక విలవిల్లాడుతున్నారు. గత సంవత్సరం మిర్చి పంట ధర 15 వేల నుండి 20వేల వరకు మార్కెట్ ఉందని ఈ సంవత్సరం మిర్చి పంట చేతికి వచ్చేసరికి పది వేల నుండి 14 వేల వరకు ధర పలుకుతుందని. మిర్చి పంటపై ఎకరానికి లక్ష 50 వేల వరకు పెట్టుబడి పెట్టామని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి పంట కోతకు చత్తీస్గఢ్, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాల నుండి వలస కూలీలు వస్తారని మిర్చికోత కోసినందుకు కేజీ పది రూపాయల నుండి 15 రూపాయల వరకు అడుగుతున్నారని, మిర్చి గ్రేడింగ్ చేసి, మార్కెట్‌కు తీసుకెళ్తే 4 వేల రూపాయల వరకు ఖర్చు వస్తుందని అన్నారు. అన్ని పోను చేతికొచ్చేసరికి 8 వేల రూపాయలు వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల వేదన గుర్తించి మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

# గ్రామపంచాయతీ కార్యాలయానికి ఫ్రీజర్ బాక్స్ అందజేత




**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండల పరిధిలోని గార్లవొడ్డు గ్రామానికి చెందిన కీర్తిశేషులు కూరాకుల లక్ష్మయ్య, శేషమ్మ జ్ఞాపకార్థం కుమారుడు కూరాకుల రమేష్ గ్రామపంచాయతీ కార్యాలయానికి శనివారం సుమారు రూ.60వేలు విలువ చేసే ఫ్రీజర్ బాక్స్‌ను అందజేశారు. ఈ ఫ్రీజర్‌ను ఆ గ్రామ పెద్దలు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫ్రీజర్ బాక్స్ గ్రామస్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గ్రామంలో పేద వారు, గ్రామస్థులు ఫ్రీజర్ బాక్స్‌ను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. చనిపోయిన వ్యక్తులు ఆఖరి నిద్ర అనే పేరుతో బాక్స్‌ను అందించడం ఎంతో సంతోషమన్నారు. తన తల్లి ప్రథమ సంవత్సరికం రోజున గ్రామపంచాయతీ కార్యాలయానికి ఫ్రీజర్ బాక్స్‌ను అందజేసిన కూరాకుల రమేష్‌ను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు భూక్యా లాలు, పటాన్ మజీద్‌ఖాన్, వేల్రపోలు వరిశంకర్ ప్రసాద్, శెట్టిపల్లి నరేష్, జయరాం, మానుకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మ్యాథ్స్ బుక్స్ వితరణ



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మధిర మండలంలోని మాటూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు సేఫ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఖమ్మం వారు సహకారంతో బేసిక్ మ్యాథ్స్ బుక్స్‌ను శనివారం ఎంఈఓ వై.ప్రభాకర్ చేతుల మీదుగా అందించటం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుండి గణితంపై ఆసక్తి పెంచుకుని బేసిక్స్ నేర్చేకున్నట్లయితే భవిష్యత్‌లో ఎటువంటి పోటీ పరీక్షల్లో అయినా సులువుగా విజయం సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సాయికృష్ణమాచార్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ విద్యార్థులకు అల్పాహారం ప్రారంభం



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల్లో చదివే టెన్త్ విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమంలో భాగంగా మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని టెన్త్ విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని శనివారం జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, ఎంఇఓ వై.ప్రభాకర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకావాన్ని సద్వినియోగం చేసుకుని రాబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నందు మంచి ఉత్తీర్ణత శాతాన్ని సాధించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

# సండ్ర అనుచిత వ్యాఖ్యలకు ఖండన



**ప్రజాపక్షం/ తల్లాడ :** మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయిదయానంద్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో ఎమ్మెల్యేగా గెల్చిన సండ్ర వెంకటవీరయ్య నియోజకవర్గాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా అక్రమంగా దోచుకున్నారని ఆరోపించారు. అలాంటి వ్యక్తి సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ దయానంద్ విజయకుమార్‌పై అవాకులు, చవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేవంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాపా సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, రాయల రాము, జిల్లా యువజన నాయకులు కటికి కిరణ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వారాల అజయ్, జనరల్ సెక్రటరీ రవీంద్ర, నాయకులు పాల్గొన్నారు.

# వినాయకుని గుడిలో హుండీ లెక్కింపు

**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణం మెయిన్‌రోడ్డులోని శ్రీ సిద్ధి వినాయక స్వామి దేవస్థానం హుండీ లెక్కింపును దేవాదాయ శాఖ ఖమ్మం విభాగం వారి పర్యవేక్షణలో పరిశీలకులు ఇ.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించటం జరిగింది. హుండీ ఆదాయం రూ.55,785 వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సిహెచ్ కోటేశ్వరరావు, అర్చకులు హరిరవిశాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

# కాసాని స్ఫూర్తితో పేదల పక్షాన భవిష్యత్ పోరాటాలు

**సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం**



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కాసాని ఐలయ్య స్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మంచికంటి భవన్ లో కాసాని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగూడెం ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడంలో కాసాని కీలక పాత్ర పోషించారని పార్టీని నిర్మించే క్రమంలో ఎన్నో ఆటంకాలు, శత్రువుల నుండి భౌతిక దాడులు సైతం ఎదుర్కొన్నాడని అన్నారు. తన యావత్ జీవితాన్ని పార్టీకి ప్రజలకి అంకితం చేసిన ధన్యజీవి కాసాని అని కొనియాడారు.ఇళ్ల స్థలాల పోరాట్లో జైలుకు వెళ్లి పేదలకు భూమి పంచేవరకు పట్టు వదలని విక్రమార్కుడిలా పోరాటాలు చేసి సాధించడాని అన్నారు. ప్రస్తుతం పాలక వర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించే క్రమంలో కాసాని మరణించడం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని అన్నారు. పేదల పక్షాన పోరాటమే కాసానికి అమరజీవి కామ్రేడ్ కాసాని సంతాప సభలు జిల్లాలో వారం రోజుల పాటు గ్రామ గ్రామాన నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఏర్పడ్డాక మొదటి జిల్లా కార్యదర్శిగా జిల్లాలో పార్టీని నడిపించడంలో ప్రజా పోరాటాలు నిర్మించడంలో కాసాని తనదైన ముద్ర వేసారని రని కొనియాడారు. కాసాని ని స్మరిస్తూ సంతాప సభలు నిర్వహిస్తామని తెలిపారు. సంతాప సభను ఏర్పాటు చేస్తున్నట్లు,అఖిల భారత నాయకత్వం హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.బ్రహ్మచారి, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, నిమ్మల వెంకన్న, నందిపాటి రమేష్, పార్టీ కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి



**-హైకోర్టు న్యాయమూర్తి సూరపల్లి నంద**
**-పటేల్ మైదానంలో ప్రారంభమైన మహిళా న్యాయవాదుల క్రీడలు**

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** క్రీడలు మానసిక ఉల్లాసాన్నికలిగిస్తాయని, స్నేహభావం పెంపొందుతుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరపల్లి నంద అన్నారు. మహిళా న్యాయవాదులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తాళ్లూరి సాహోస్ చౌదరి మోమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళా క్రికెట్, కబడ్డీ పోటీలను శనివారం జిల్లా ప్రధాన న్యాయయుర్తి జి.రాజగోపాల్ తో కలిసి సూరపల్లి నంద ప్రారంభించారు. ఈ సందర్భంగా సూరపల్లి నంద మాట్లాడుతూ న్యాయవాదులు కూడా క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా దేహదారుఢ్యం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఉమాదేవి, అపర్ణ, అర్చన, రాంప్రసాదరావు, చంద్రశేఖర్‌రావు, ఏపూరి బిందు ప్రియ, కల్పన, దీప, రజని, శివరంజని, మాధవి, శీనయ్య, తాళ్లూరి సాహోస్ చౌదరి బాధ్యులు తాళ్లూరి దిలీప్, సీనియర్ న్యాయవాదులు కొల్లి సత్యనారాయణ, అశోక్ గౌడ్, ఎన్.శ్రీనివాసరావు, చింతనిప్పు వెంకట్, పలువురు మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

# పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం

**ప్రజాపక్షం/ఏన్కూరుః** పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం కార్యక్రమాన్ని మండల అభివృద్ధి అధికారి రమేష్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు పదో తరగతి విద్యార్థులకు 38 రోజులు పాటు అల్పాహార అందించేందుకు నిర్ణయించిందన్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా అల్పాహారం అందజేశారు. పదో తరగతి విద్యార్థులు ఉదయం నుండి సాయంత్రం వరకు పాఠశాలలోనే ఉండాల్సి ఉండగా అల్పాహారాన్ని అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపివో జివిఎస్.నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూరాకుల సైదయ్య, ఉపాధ్యాయులు జి.వెంకటలక్ష్మి, రాఘవరావు, శ్రీధర్, కస్తూరి, విజయలక్ష్మి, పుల్లయ్య, శంకర్‌రావు, వర్జినియా, రాంబాబు,



నర్సింహారావు, సులోచన, భీమ్‌సింగ్, వీరయ్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# మెకానిక్‌కు ఆర్థికసాయం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో మెకానిక్‌కు ఆర్థిక సాయం అందించారు. ఖమ్మం నగరంలో గత పదేళ్లుగా మెకానిక్ వృత్తిలో కొనసాగుతున్న ముస్తఫానగర్‌కు చెందిన తూము అంజిబాబు గత నెలలో రోడ్డు ప్రమాదంలో తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. ఐదు నెలలు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించడంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. మెకానిక్ పరిస్థితి తెలుసుకుని శనివారం ఖమ్మం కార్పోరేషన్ టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ అధ్యక్షులు వంగాల కొండలరావు, సభ్యులు రూ. 10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ యూనియన్ తరుపున మెకానిక్ కుటుంబాలకు అండగా ఉంటున్నామని తెలిపారు. మెకానిక్‌లకు రోడ్డు ప్రమాదాలు, చనిపోయినప్పుడు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకరాలు అందడం లేదని మెకానిక్‌లను అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తించి ప్రమాద



బీమాను వర్తింప జేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండి నాగేశ్వరరావు, పులుసు శ్రీనివాసరావు, వడ్డెపూడి గంగరాజు, మట్టా రవి, చీటి వెంకట్, అన్నదేవర భద్రయ్య, కృష్ణారెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.

# నాసిరకం వరి విత్తనాలతో రైతుల ఆందోళన

**-పంటలను పరిశీలించిన అధికారులు**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నాసిరకం వరి విత్తనాలతో తాము తీవ్రంగా నష్ట పోయామని రైతులు ఆందోళన చెందుతు న్నారు. రఘునాథపాలెం మండల పరిధిలోని కోయచలక గ్రామానికి చెందిన పలువురు రైతులు యాసంగి వరి సాగు చేశారు. నూజివీడు కంపెనీ ఓంకార్ అనే వెరైటీ వరి విత్తనాలను సాగు చేసిన 10 మంది రైతులకు చెందిన సుమారు 30 ఎకరాల్లో వరి పైరు పూర్తిగా పెరగక ముందే 40 రోజుల్లోనే పొట్ట దశకు వచ్చి ఈని నాసిరకం కంకులు వేశాయి. వరి విత్తనాలు నకిలీ కావడం వల్లే ఇలా జరిగిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ. 50 వేల వరకు పెట్టుబడులు పెట్టినట్లు వారు తెలిపారు. ఇప్పుడు నకిలీ విత్తనాల వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కోయచలకతో పాటు కోటపాడు, చిమ్మపుడికి చెందిన మరి కొంత మంది రైతులు కూడా ఈ కంపెనీ విత్తనాలను సాగు చేసి నష్టపోయినట్లు సమాచారం. రైతులు ఇచ్చిన సమాచారం మేరకు విత్తన కంపెనీకి చెందిన ప్రతినిధులు, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, ఏఈవో తదితరులు శనివారం వరి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తోట రవి, అమరం శివ, చెరుకూరి వెంకటేశ్వర్లు, చెరుకూరి నరేష్, హన్మంతరావు, మహేష్, శ్రీను, బ్రహ్మం, మాజీ సర్పంచ్ మాధంశెట్టి హరిప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కోయచలకలో నీటి వనరుల సర్వే



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కోయచలక గ్రామంలో నీటి వనరులపై సర్వే నిర్వహించారు. వేసవి కాలంలో గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనల మేరకు గ్రామంలో అధికారులు సర్వే నిర్వహించారు. గ్రామంలో ఉన్న నీటి వనరులను గుర్తించారు. గ్రామంలో ఒక బావి, రెండు బోర్లు, 18 బోరింగ్‌లు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో ఎనిమిది బోరింగ్‌లు పనిచేస్తుండగా 10 బోరింగ్‌లకు మరమ్మతులు చేయాల్సి ఉందని సర్వేలో అధికారులు గుర్తించారు. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా అధికారులకు పంపించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి, నాయకులు మాధంశెట్టి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు టిపిఎఫ్ ఉమ్మడి జిల్లా మహాసభ

**-హాజరు కానున్న కూనంనేని, ప్రొ॥ కాశీం, లక్ష్మణ్**

**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఉమ్మడి ఖమ్మంజిల్లా నాల్గవ మహాసభలు ఆదివారం ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో జరగనున్నాయి. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ మహాసభలలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొ॥ కాశీం, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొ॥ గడ్డం లక్ష్మణ్, టిపిఎఫ్ రాష్ట్ర నాయకులు నాగభూషణ్, సంజీవరావు, ప్రజా కళా మండలి నాయకులు జాన్, స్పర్శ అధ్యయన వేదిక కన్వీనర్ కాకి భాస్కర్ తదితరుల పాల్గొంటారని టిపిఎఫ్ బాధ్యులు తెలిపారు.

# నేడు ఉప ముఖ్యమంత్రి భట్టి పర్యటన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క నేడు ఖమ్మంజిల్లాలో పర్యటించనున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు వైరాలో అధికారులు, అనాధికారులతో సమావేశం నిర్వహిస్తారు. ఉదయం 11.10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కుటుంబ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1.45 మధిరలో పర్యటిస్తారు.

# నిర్మలమ్మది సంపన్నుల బడ్జెట్

**-ఉపాధి, వ్యవసాయ రంగాల పట్ల ఉదాసీనత**
**-సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు**



ప్రజాపక్షం/ఖమ్మం : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2025 26 కేంద్ర బడ్జెట్ సంపన్నుల బడ్జెట్ అని నిర్మలా సీతారామన్ మరోసారి ధనిక, కార్పొరేట్ వర్గాలకు కొమ్ముకాశారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. అంకెల గారడీ చేసిందని ఆయన తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై స్పందిస్తూ శనివారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో నిరుద్యోగం పెరిగి ఉపాధి లేక యువత దేశానికి భారమవుతున్న దశలో ఉపాధి రంగాలను పూర్తిగా విస్మరించారని ఆయన తెలిపారు. 11 ఏళ్ల బిజెపి పాలనలో నిరుద్యోగం గణనీయంగా పెరిగిందని పెరిగిన నిరుద్యోగానికి తగిన రీతిలో ఉపాధి కల్పన లేదన్నారు. అసలు ఉపాధి కల్పన ఊసెత్తలేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికీ దేశంలో 50 శాతానికి పైబడి వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని అటువంటి వ్యవసాయ రంగం పట్ల ఉదాసీన వైఖరి అవలంభించారన్నారు. ప్రతి బడ్జెట్‌లోనూ వ్యవసాయ రంగానికి కేటాయింపులు జరపడం దానిని ఖర్చు చేయకపోవడం అలవాటుగా, బిజెపికి అనవాయితీగా వస్తుందన్నారు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలను నిలువరించే ఏ చర్య బడ్జెట్‌లో లేదని ఇది సంపన్నులను మరింత సంపన్నులుగా పేదవాడిని మరింత పేదవానిగా మార్చే బడ్జెట్ అని హేమంతరావు స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు, ఆరోగ్యం, విద్య, వైద్యం, గ్రామీణ పేదలకు అవసరమైన గ్రామీణ ఉపాధి హామీ పథకం మొదలైన వాటికి నామ మాత్రపు కేటాయింపులు చేశారని ఆరోపించారు. బీమా రంగంలో నూరు శాతం ఎఫ్‌డిఐలను ఆహ్వానించడం ద్వారా ప్రైవేటు రంగానికి మోడీ సర్కార్ తలొగ్గినట్లు అయిందని దీనితో పబ్లిక్ సెక్టార్ పూర్తిగా దెబ్బతింటుందని ఆయన తెలిపారు. ధరల నియంత్రణకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకోలేదని దీనితో పేదలు మరింత ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. తెలంగాణ పట్ల రాజకీయ వివక్ష ప్రదర్శించారని హేమంతరావు తెలిపారు. ఒక రాష్ట్రంగా పరిగణించకుండా కక్ష సాధింపు ధోరణిని అవలంభించారని ఇది కేవలం బిజెపి రాజకీయ అవసరాలు, మోడీ అనియయుల కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్ అని హేమంతరావు తెలిపారు.

# బడ్జెట్‌లో వ్యవసాయ, ఉపాధి రంగాలకు కోత

**సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**




ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ప్రతిపాదనలో ఉన్న విమానాశ్రయం నిర్మాణం కోసం అదేవిధంగా మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటుకు కోసం కేంద్ర బడ్జెట్లో కేటాయింపులు జరపకపోవడం జిల్లా ప్రజలను నిరాశకు గురిచేసిందని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 202526 కేంద్ర బడ్జెట్ సాబీర్ పాషా స్పందిస్తూ వ్యవసాయ, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాలను పూర్తిగా బడ్జెట్లో పూర్తిగా విస్మరించి రైతులను, నిరుద్యోగులను నిరాశకు గురిచేశారన్నారు. గత ఏడాదికంటే మౌలిక సదుపాయాల అభివృద్ధికి కోసం కేటాయించే నిధుల్లో కోతలు విధించడమేంటని ప్రశ్నించారు. మధ్యతరగతి వర్గాల ఆర్థిక భారాన్ని తగ్గించే విధంగా ఆదాయపన్ను విషయంలో ప్రత్యేకమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నామని గొప్పలు చెప్పుకున్న కేంద్రం అందుకు నిధులు కేటాయించలేదని, విభజన హామీలు ఊసెత్తలేదని, హైదరాబాద్ రీజనల్ రింగు రోడ్డు, మూసి నది ప్రక్షాళన, మెట్రో రైల్ విస్తరణ వంటి వాటికి కేంద్రం నిధులు కేటాయించకుండా తెలంగాణా రాష్ట్రానికి అన్యాయం చేశారని, నిర్మలమ్మది సంపన్నుల బడ్జెట్, ధనికులు, కార్పొరేట్ వర్గాలకు కొమ్ము కాసే బడ్జెట్ మాత్రమేనని సాబీర్ పాషా విమర్శించారు.

# ప్రైవేటీకరణకు ఊతమిచ్చిన బడ్జెట్

**-సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్**



ప్రజాపక్షం/ఖమ్మం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రైవేటీకరణకు ఊతమిస్తుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. శనివారం బడ్జెట్‌పై సిపిఐ జిల్లా సమితి పక్షాన ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నూటికి నూరు శాతం బీమా సహా పలు రంగాల్లో ఎఫ్‌డిఐలను ఆహ్వానించడమంటే ప్రైవేటీకరణకు నూటికి నూరు శాతం సహకరించినట్లేనని ఆయన తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి సంపన్న వర్గాలకే కొమ్ము కాస్తున్నారని, సంపన్నులను మరింత సంపన్నులుగా మార్చే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ సైతం అదే రీతిలో ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా బడ్జెట్ ఉందన్నారు. నిరుద్యోగం పెరిగి ఉపాధి వనరులు వట్టిపోయిన నేపథ్యంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు కానీ, ఉపాధి వనరులను పెంచేందుకు కానీ బడ్జెట్‌లో ఎటువంటి ప్రతిపాదనలు లేకపోవడం శోచనీయమని ఇది పూర్తిగా ప్రజావ్యతిరేక బడ్జెట్‌గా సురేష్ అభివర్ణించారు. వ్యవసాయ రంగాన్ని, పేదలను పూర్తిగా విస్మరించారని వ్యవసాయ కూలీల నేపథ్యంలో వచ్చిన జాతీయ ఉపాధి హామీ పథకానికి మోడీ సర్కార్ తూట్లు పొడుస్తుందని సురేష్ తెలిపారు. ఈ దేశ జనాభాలో సగానికి పైగా ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని మరోసారి విస్మరించారని మోడీకి, ఆర్థిక మంత్రి నిర్మలకు కార్పొరేట్లపై ఉన్న ప్రేమ రైతులపై, యువతపై, గ్రామీణ కూలీలపై లేదన్నారు. బడ్జెట్‌లో ఉన్న లోటు భవిష్యత్తు అప్పుల భారతాన్ని సూచిస్తుందని ఆయన తెలిపారు.

# కార్మిక వర్గాన్ని విస్మరించిన బడ్జెట్

**ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు**



ప్రజాపక్షం/ఖమ్మం : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక వర్గాన్ని పూర్తిగా విస్మరించిందని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం కనీస ప్రతిపాదన చేయలేదని ఇది ప్రజా, కార్మిక వ్యతిరేక బడ్జెట్ అని ఆయన తెలిపారు. 13 లక్షల కోట్ల రూపాయల లోటు చూయించారని ఈ లోటును అప్పులతో భర్తీ చేసి భవిష్యత్తులో రుణ భారతగా మార్చనున్నారని ఆయన ఆరోపించారు. సంఘటిత రంగ కార్మికులకు కానీ, అసంఘటిత రంగ కార్మికులకు కానీ ఏ పథకాన్ని, సంక్షేమాన్ని కనీసం ప్రస్తావించ లేదని ఆయన తెలిపారు. ఉపాధి హామీ, కార్మికుల వేతనాల పెంపు ప్రస్తావన లేదన్నారు. విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం, దేశ స్వాలంభనకు ఇబ్బందికర పరిస్థితులను తీసుకు రానుందని ఆయన తెలిపారు. డీజిల్, పెట్రోల్ ధరలను జిఎస్టి పరిధిలోకి తీసుకు రాకుండా ప్రత్యక్ష దోపిడీకి కేంద్ర ప్రభుత్వం పరోక్ష అనుమతి ఇచ్చిందన్నారు. దేశ ప్రజల ఆదాయాలు పెంచేందుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విద్యా, వైద్య రంగాలను పూర్తిగా విస్మరించారని శింగు నర్సింహారావు తెలిపారు. ఈ బడ్జెట్‌ను దేశ ప్రజలు తమ పోరాటాలు, నిరసనలతో తిప్పికొట్టాలని ఆయన కోరారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్న



ప్రజాపక్షం/భద్రాచలం : కేంద్రప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి గుండు సున్న కేటాయింపులు చేశారని బిఆర్‌ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ విమర్శించారు. రెండు జాతీయ పార్టీలు తెలంగాణాలో 16 పార్లమెంట్ సీట్లు గెలిచి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంతో విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మేలు చేస్తారని పార్లమెంట్ సీట్లు కట్టబెడితే తెలంగాణ ప్రయోజనాల పై నోరుమెదిపే పరిస్థితి లేదన్నారు. కేంద్రంలోని మోడి సర్కార్ తెలంగాణ రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమను చూపిస్తోందని యద్దేవా చేశారు.

## రాజకీయ బడ్జెట్ తప్పా.. ప్రజలకు ఉపయోగం లేదు

**-కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్**



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాజకీయ కోణంలో తప్ప ప్రజలకు ఉపయోగపడేవిధంగా లేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. బిజెపి ప్రభుత్వం గత 11 ఏళ్లుగా దేశాన్ని పరిపాలిస్తున్న ప్రతిసారి బడ్జెట్‌ను రాజకీయ కోణంలోనే ప్రవేశపెడుతున్నారని ప్రజలకు ఉపయోగపడే ఎటువంటి సంస్కరణలు తీసుకు రావడం లేదన్నారు. నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు ప్రధానులుగా ఉన్నప్పుడు దేశ ఆర్థిక విధానం, ఇప్పుడు దేశ ఆర్థిక విధానం ఎలా ఉన్నదంటే రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. బడ్జెట్‌లో అంకెల గారడీ తప్ప ఏమి లేదన్నారు. ఇప్పటికైనా ఆలోచించి ప్రజలకు ఏమి కావాలో, అభివృద్ధి ఎలా జరుగుతుందో దేశ ఆర్థిక వ్యవస్థ ఎలా బలపడుతుందో చర్చించి బడ్జెట్‌ను రూపొందించాలని ఆయన తెలిపారు.

## మాయ లేడిని తలపించేలా బడ్జెట్

**-సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ మాయ లేడిని మరపించేలా ఉందని, ఢిల్లీ, బీహార్ ప్రజల ఓట్లకు గాలం వేసే లక్ష్యంతో ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. రూ.50.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో ద్రవ్యోల్బణం ధరల మంటకు ఉపశమనం లేదన్నారు. విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు తగ్గాయన్నారు. వ్యవసాయ రంగ సంక్షోభానికి పరిష్కారం లేదన్నారు. కనీస మద్దతు ధరల చట్టం, గిట్టుబాటు ధరల హామీ బడ్జెట్‌లో లేదన్నారు. గ్రామీణ ఉపాధి హామీకి కోత పెట్టారని ప్రభుత్వ రంగ సంస్థల, ఎల్‌ఐసి ఊసురు తీసే ఎఫ్‌డిఐలకు వంద శాతం గేట్లు తెరిచారని ఆయన తెలిపారు. ప్రజా సంపదను కార్పొరేట్లకు, విదేశీ ఎంఎన్‌సిలకు దోచిపెట్టే కుట్రలకు బడ్జెట్‌లో మార్గం సుగమం చేశారని ఆయన విమర్శించారు. పెట్రోల్, డీజిల్‌ను జిఎస్టి పరిధిలోకి తీసుకురాకుండా దోపిడీకి పాల్పడుతూ మధ్యతరగతికి భారీ ఉపశమనం అనేది నిజం కాదన్నారు. తెలంగాణకు అన్యాయం చేశారని, విభజన హామీల ఊసెలేదన్నారు.

## మేడిపండు చందంగా నిర్మలమ్మ బడ్జెట్

**-మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు**



ప్రజాపక్షం/ఖమ్మం : కేంద్ర ప్రభుత్వం తరుపున ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్ మేడిపండును తలపిస్తుందని మసిబూసి మారేడుకాయ అన్న చందంగా అంకెల గారడీ చేసిందని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. ఎన్నికల దృష్టితో బీహార్‌కు వరాల వరద కురిపించి తెలంగాణ సహ ఇతర రాష్ట్రాలకు మొండి చేయి చూపారని ప్రతిపక్ష రాష్ట్రాలను పూర్తిగా విస్మరించారని ఆయన తెలిపారు. 12 లక్షల వరకు పన్ను మినహాయింపులో అంతర్గత దగా ఉందని రంగారావు ఆరోపించారు. మద్దతు ధర విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి మారలేదన్నారు. జిఎస్టిపేరున పన్నుల భారం మోపుతున్నారని అల్పాదాయ వర్గాలను పూర్తిగా విస్మరించారని ఆయన తెలిపారు. నిరుద్యోగ సమస్య గురించి ప్రస్తావన లేదని, నిరుద్యోగ సమస్య నివారణకు నిర్దిష్ట ప్రణాళిక లేదని, మద్దతు ధరల ప్రస్తావనే లేదన్నారు. దేశంలో ప్రైవేటీకరణకు గేట్లు బార్లా తెరిచారని బీమా రంగంలో ఎఫ్‌డిఐలను నూరు శాతం ఆహ్వానించడం కార్పొరేటీకరణకు ప్రభుత్వం కవచంగా ఉండడమేనన్నారు. విద్యా, వైద్య రంగాలకు తగినంత ప్రాధాన్యత నివ్వలేదన్నారు. బిజెపి ప్రభుత్వ బడ్జెట్ మొత్తంగా కార్పొరేట్ బడ్జెట్‌గా ఉందని ఆయన తెలిపారు.

## మైనార్టీల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిన కేంద్రం



ప్రజాపక్షం/భద్రాచలం : కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామ్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో మైనార్టీలకు మొండిచెయ్యి చూపారని మైనార్టీ జిల్లా అధ్యక్షులు యండి యాకూబ్ పాషా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మైనార్టీ సంక్షేమానికి ఏనాడూ ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. గత ఏడాది పద్దులో కూడా రూ.3183.24 కోట్లను మాత్రమే కేటాయించారని, ఈ పద్దులో రూ.3350 వరకు కేటాయింపులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం పేద మైనార్టీలకు అందిస్తున్న ఉపకార వేతనాలు కూడా రద్దు చేసిందని, గణాంకాల్లో మాత్రం కేటాయింపులు చూపిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి ఒక్క పథకం కూడా అమలుకావడం లేదని, విద్యా, ఆర్థిక పరంగా అణిచివేతకు గురవుతున్నారని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వంక ఆవాలనే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు.